
దశాబ్దాలుగా
ఆ నియోజకవర్గంనుండి
గెలుస్తూ వచ్చిన అతను
ఎలా ఓడి పోయాడు?




# భయ్యాజీ చిత్తయ్యాడోచ్

"అరె! అరె! అరె! భయ్యాజీ ఓడిపోయాడు"

ఎవరో జోక్ వేశారు!

ఎవరో వ్యంగ్యబాణం వేశారు!

ఎవరో నన్ను గాడిదను చేశారు.

లేకపోతే భయ్యాజీ ఓడిపోవడమా? భయ్యాజీ పేరు చెబుతూనే అపజయం ఆమడదూరం పారిపోదూ?

పొద్దున వార్తల్లోనే ఈ పుకారు.

టీవీ న్యూస్‌లోనూ ఇదే అసత్య ప్రచారం.

ఇలాంటి దుష్ప్రచారం ఎవరు చేస్తున్నారో తెలీదు. ఎంత ప్రయత్నించినా నాకు అంతుపట్టలేదు.

ఆయనతో కల్లో, నన్ను అందరూ లెక్క వేస్తారు. ఆయన ఖుషామద్‌గాళ్ళలో నాకు పెద్ద ఆసనం వేస్తారు. "బహుశ ఇందువల్లేనేమో పొద్దునుంచీ ఫోన్లమీద ఫోన్లు వస్తున్నాయ్. "ఇది నిజమేనా? ఇది నిజమేనంటారా? ఇది ఎలా జరిగింది?"

నేను ఆయన అభిమానులకు ఏం జవాబు చెప్పను చెప్పండి. కళ్ళేమో శ్రావణ మేఘాల్లా వర్షిస్తున్నాయ్. నేను కల్లోకూడా అనుకోలేదు. జీవితంలో ఇలాంటి రోజు చూడాల్సి వస్తుందని. ఈ వార్త విన్నప్పుడు శ్రవణశక్తిమీద నాకే అనుమానం వేయసాగింది.

అవును, ఇప్పుడేం చేయాలి? ఎక్కడికి వెళ్ళాలి? ఎవరి ఆశ్రయం కోరాలి? నిజమేమిటో అబద్ధమేమిటో ఎవరిని అడగాలి? కూపీ తీయడం ఎలా?

భయ్యాజీనే పోయి అడగడం పులినోట్లో



తలపెట్టడమౌతుంది.

ఈ 'కాన్స్ట్యుయంసీ'లో భయ్యాజీ ఓడిపోవడం ఏమీ మామూలు విషయం కాదుమరి. ఇప్పటి సంగతికాదు. దశాబ్దాలుగా భయ్యాజీ ఇదే క్షేత్రంనుంచి విడవకుండా గెలుస్తూ వస్తున్నారు. అనేకసార్లు ఆయనకు ఎదురుగా నిల్చునుండేందుకు 'కాండిడేట్'కూడా దొరికేవాడుకాదు. బుద్ధిలేనివాడై

నా ధైర్యంచేసి నిల్చుంటేనా మట్టి గరవవల్సిందే. డిపాజిట్ పోగొట్టుకోవల్సిందే. అలాటి ప్రఖ్యాతిపొందిన నేత మా భయ్యాజీ.

ఆయన నేతాగిరి సాటిలేనిది. మామూలు ఓటర్లమీద ఆయన శ్రద్ధ చూడాల్సిందే గాని చెబితే తెలిసేదికాదు. ఆఖరికి గుడిసెల్లో వుండే పేదవారి ఎడలకూడా ఆయన ప్రేమ వాత్సల్యాలు అపారంగా వుండేవి. ఎవరికైనా ఏదైనా ఆపద వస్తే అందరికన్నా ముందే భయ్యాజీ అక్కడ చేరుకునేవాళ్ళు. భుజానికి భుజంపట్టి సాయానికి ముందుకొచ్చేవాడాయన. ఎవరింట్లోనైనా పెళ్ళో, పబ్బమో అయితే ఇంకేముంది అంతా ఆయన నేతృత్వంలోనే జరిగిపోయేది. ఎలక్షన్లప్పుడు మతాన్ని ఎంతగా తిట్టినా దుర్గా నవరాత్రోత్సవాల్లోనూ, వినాయకచవితి, ఓట్లను దృష్టిలో పెట్టుకునే ఆయన నడుంకట్టి నిలబడతాడు.

ఇదంతా ఓట్ల పండగకు ముందే సుమండీ. లేకపోతే ఆయనకు గాలి పీల్చుకోవడానికి సైతం టైము దొరకుతుందా? అటు ప్రధానమంత్రిగారితో మీటింగ్సూ, లోక్‌సభ మీటింగ్సూ, వీటితోటే రోజులు గడచిపోతాయ్. హఠాత్తుగా అమెరికా వెళ్ళాల్సొస్తే తిరిగి వచ్చీ రాకుండా ఇటు రష్యాకి హడావిడిగా వెళ్ళాల్సొస్తుంది. లోక్‌సభ కమిటీ మీటింగో, హఠాత్తుగా పార్టీ 'వాకౌట్' వీటితోటే బిజీగా వుంటారు భయ్యాజీ!

తన కాన్‌స్టిట్యుయెంసీ ప్రజలతో కలవడానికీ, మాట్లాడడానికీ తీరిక ఎక్కడ దొరుకుతుంది. అటు ఎలక్షన్స్ ఎనౌన్స్ చేయడమేమిటి, అంతటి బిజీ బాడీకూడా అన్ని పనులూ, కార్యక్రమాలు, పార్టీలు వదిలి మా పట్నం వచ్చి వాలతారు. ఇక్కడే హాల్ మహాంవేస్తారు. అడిగినా అడక్కపోయినా ఎన్నో రకాల అనుభవాలు చెవుల్లో ఊదుతారు. పార్టీలిస్తారు. ఎవరినెవరినో ఒప్పిస్తారు. తనవైపు తిప్పుకుంటారు. ఎవరెవరివో దుఃఖగాథలు వింటారు. గ్లిసరిన్ కన్నీళ్ళు కారుస్తారు. హఠాత్తుగా ఏ గుడిసెలోనో జొరబడి ఏ ముసలమ్మనో అమ్మమ్మ అనో, బామ్మ అనో పిలిచి, పట్టుబట్టి ఆమె చేతికూడు తింటాడు. ఎవరిదో ధైర్యం కూడగట్టితే ఇంకొకరికి కుమారీరత్నానికీ, పెళ్ళికొడుకు తాలూకు భోగట్టా తెలియజేస్తాడు.

ఆ రోజుల్లో నగరపు ఆత్మే, భయ్యాజీ రూపంలో కిందకు దిగి వచ్చిందా అనిపిస్తుంది.

ఎలక్షన్లప్పుడు భయ్యాజీ ఊళ్ళోకి రావడం, క్రిస్మస్ అప్పుడు శాంతాక్రజ్ రావడం లాంటిది. నోరుతెరచి అడగడం ఆలస్యం. వరప్రసాదం దొరుకుతుంది. అప్పుడప్పుడు అడగకుండానే దొరుకుతుంది. ఆయన దయ.

భయ్యాజీని రాజకీయ నాయకుడనుకోవడం కష్టం. ఇంతటి దయాళువైన, కరుణామయుడైన వ్యక్తి గూర్చి లైట్‌వేసి వెతికినా దొరకడం కష్టం.

అందువల్ల భయ్యాజీ ఓడిపోయారంటే నమ్మడం ఎలా? ఈ వింతను ఎలా నమ్మడం! ఎలా అంగీకరించడం! ఏ ముఖం పెట్టుకుని ఆయన దగ్గరకు ఈ చేదువార్త తీసుకువెళ్ళడం?



అయినా నిప్పులేకుండా పొగ ఎలా వస్తుంది? పండీపండని పండు పడ్డట్టు భయ్యాజీ బంగళాలో వచ్చిపడ్డాము నేను.

ఆశ్చర్యం! నేనమకున్నదానికి వ్యతిరేకం గా వుందక్కడ వాతావరణం. ఎవరిదో పెళ్ళి ధూమ్‌ధామ్‌గా జరుగుతున్నట్లనిపిస్తున్నది చూస్తే. ఓ పక్కన సన్నాయిమేళం మోగుతుంటే ఇంకొక పక్క అతిథులకు

స్వాగత సత్కారాలు జరుగుతున్నాయ్. నా మనసు ప్రసన్నమైంది. భయ్యాజీ ఎలా ఓడతారు? ఆయన గెలిచాడు చూడండి! సంతోషంతో సెలబ్రేట్ చేస్తున్నారు. నేనెంతటి మూర్ఖుడిని, ఇంత లేటుగా వచ్చాను. ఎవరివో బూటకపు మాటలు విని లోకము ముసుగుని కూర్చున్నాను. నన్నుగురించి భయ్యాజీ ఏమనుకున్నారో? నేనెందుకు రాలేదనుకున్నారో? ఆయన మనసులో నా 'ఇమేజ్' పాడైపోయి వుంటుంది. నేను ముందే మనవిచేసుకున్నాను నే నాయన పెద్ద తోకనని ఆయన శిష్యుడనని చెప్పుకునే నా పనులు చక్కదిద్దుకుంటూ వచ్చాను నేను ఇంతకాలం. ఏమైనా కానీ ఆఖరికి సక్రమమైన పనే జరిగింది. ముఖంలో సంతోషపు పొంగు తెప్పిస్తూ ఒక్క లాంగ్ జంప్‌తో లోపలికి అడుగుపెట్టాను నేను. ఛాన్స్ చేతుల్లోంచి తప్పిపోకుండా..

షామియానాలోంచి ఆహార పదార్థాల సువాసన తేలివస్తున్నది. వరండాలో ఆనవాయితీగా భయ్యాజీ తఖ్తమీద కూర్చుని పాన్ సేవను చేస్తున్నారు. ముఖంలో అదే చిరపరిచితమైన అంగుళంన్నర చిరునవ్వు ఓటుపొందే 'అందాజా'తో నాట్యం చేస్తున్నది.

తటాలున వంగి ఆయన పాదాభివందనం చేశాను నేను. "భయ్యాజీ! అభివందనలు" అన్నాను.

"ఒరే పెద్దాడా! నువ్వా? ఎప్పుడొచ్చావ్? అంతా క్షేమమా!" ఆయన మామూలుగా అడిగినట్లే అడిగారు.

"మీ దయవల్ల, అంతా క్షేమమే భయ్యాజీ! ఈ సారికూడా ఉట్టికొట్టారుమీరు! మంత్రి అవడానికి ఛాన్సెస్ వుంటయ్" అన్నాను నేను చిరునవ్వు నవ్వుతూ.

"గెలిస్తేకదా?" బిగ్గరగా నవ్వుతూ అన్నారాయన.

"అంటే? మీరు గెలిచే వుంటారు!" అన్నాను తత్తరపాటుతో నేను.

"లేదురా! ఓడిపోయానేమో మంచిపనే అయింది" అస్పష్టంగా అన్నారాయన.

"రామరామ! అలా ఎలా అయింది భయ్యాజీ!" అంటూ చెవుల్లో వేళ్ళు దోపుకున్నాను నేను.

"ఎందుకురా చింత! హూ? భోజనం చేశావా? పో! పోయి భోజనం చేసిరా..."

"కానీ..."

"కానీ లేదు. దమ్మిడీలేదు. పోయి భోజనం చేసిరా! నేనిప్పుడు ఈ ఊళ్ళోనే వుండబోతున్నానుగా! చాలామందిని నేను ఎరుగను. అందుకని 'డిన్నరు' ఇస్తున్నాను. ఈ విధంగానన్నా అందరితో పరిచయం అవుతుందని. ఎలక్షను పేరు చెప్పుకు కొండ వెనకేసుకున్నానుగా రేపటికోసం" కన్నుకొట్టి సౌంజ్ఞచేస్తూ అన్నాడాయన.

"మీరు నాకు చేసిన వాగ్దానం మాటేమిటి?" ఆయన గెలిస్తే నాకు చేస్తానన్న ఉపకారం గురించి ఆలోచిస్తూ అడగాలనుకున్నాను నేను. అడగలేకపోయాను.

షామియానాలోకి వెళితే అక్కడే వున్నారు భయ్యాజీ చమ్చాలందరూ, తోకలందరూ. ఆవురావురంటూ తింటున్నారు భోజనం.

"భలే! భలే! భయ్యాజీ ఓడిపోయారో



చ్!'' ఎవరో బిగ్గరగా నవ్వుతూ అన్నారు.

''వెక్కిరిస్తున్నారా?'' నేను కొంచెం కోపంతో అన్నాను.

''లేదు తోకగారూ! ఆయనా డబ్బు మిగుల్చుకున్నారు. మనకూ మిగిలింది! లేకపోతే...''

''అర్థం అయిందా...?'' ఎవరో అడిగారు.

నా పెదవులూ నవ్వులు చిందించాయ్. హాయిగా గాలి పీల్చి భోజనానికి ఉపక్రమించాను నేమకూడా.

*